E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 30-09-2025 (వారం) మంగళవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



పిటా' అమలుకు ప్రత్యేక అధికారులను నియమించండి! » 3లో



## బతుకమ్మ వైభవం

» రెండు గిన్నిస్ రికార్డులు కైవసం

» సరూర్‌నగర్ స్టేడియంలో ఆడిపాడిన ఆడపడుచులు

» రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు

» చిత్తూ.. చిత్తూల బొమ్మ.. గిన్నీసుకెక్కెనమ్మా..

తరువాయి 2లో

# స్థానిక పోరుకు సైరన్

- షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్
- తక్షణమే అమల్లోకి ఎన్నికల కోడ్
- తొలుత మండల, జిల్లా పరిషత్‌ల ఎన్నికలు
- రెండు దశల్లో అక్టోబర్ 23, 27 తేదీల్లో నిర్వహణ
- నవంబర్ 11న ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల కౌంటింగ్
- మూడు దశల్లో జరగనున్న పంచాయతీ ఎన్నికలు
- అక్టోబర్ 31, నవంబర్ 4, 8 తేదీల్లో 'పల్లె పోరు'
- ఏ రోజుకు ఆ రోజే వెలువడనున్న పంచాయతీ ఎన్నికల ఫలితాలు
- అక్టోబర్ 9న మొదలై నవంబర్ 11న ముగియనున్న స్థానిక ఎన్నికల ప్రక్రియ




తరువాయి 2లో

ఈకబురు, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నగారా మోగింది. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణీకుముదిని సోమవారం విడుదల చేశారు. తొలుత మండల, జిల్లా పరిషత్‌ల ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక సమరం మొత్తం ఐదు దశల్లో జరగనుంది. మండల, జిల్లా పరిషత్‌ల తొలి విడత ఎన్నికలు అక్టోబర్ 23న, రెండో విడత అదే నెల 27న జరగనున్నాయి. గ్రామ పంచాయతీల మొదటి దశ ఎన్నికలు అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో దశ ఎన్నికలు అదే నెల 8న జరగనున్నాయి. మొత్తం మీద అక్టోబర్ 9న మొదటి దశ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీతో మొదలయ్యే స్థానిక ఎన్నికల ప్రక్రియ, నవంబర్ 11న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఫలితాల వెల్లడితో ముగియనుంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల ఓట్ల కౌంటింగ్ (రెండు దఫాలకు) నవంబర్ 11న నిర్వహిస్తారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు ఏ రోజుకు ఆ రోజు సాయంత్రమే చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు. షెడ్యూల్ విడుదల చేసిన వెంటనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో (హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లాలు మినహా) ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎలక్షన్ కోడ్) అమల్లోకి వచ్చిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రకటించారు.

భారత రేటింగ్ 'బీఏఏ3' » 4లో



అపజయం వెనుకే విజయం » 5లో





## జీఎస్టీ తగ్గింపుతో పెరిగిన పొదుపు

తరువాయి 2లో



## ఇంటింటికీ 'బాకీ కార్డు'

- 4 కోట్లు పంచేందుకు ఏర్పాట్లు
- ప్రభుత్వ హామీల అమలుపై నిలదీత
- స్థానిక ఎన్నికలకు భారత రాష్ట్ర సమితి సన్నద్ధం
- కేటీఆర్, హరీశ్‌రావు పర్యటనలు

తరువాయి 2లో

పవన్ కల్యాణ్ ఓజీకి బిగ్ షాక్..! » 5లో



ప్రపంచకప్ వేటకు వేళాయె... » 6లో




## ఆల్మట్టిపై సుప్రీంలో పోరాటం

» ఆల్మట్టిపై సుప్రీంలో పోరాటం

» రాష్ట్ర వాటాల విషయంలో రాజీపడం: మంత్రి ఉత్తమ్

» స్థానిక ఎన్నికల తర్వాత నీటి వినియోగ సంఘాల ఏర్పాటు



ఈకబురు, హైదరాబాద్: ఎగువ కృష్ణా నదిపై కర్ణాటకలో నిర్మించిన ఆల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో బలంగా పోరాడాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర వాటాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ (జనరల్) అంజాద్ హుసేన్, సలహాదారులు ఆదిత్యనాథ్ దాస్‌తో మంత్రి సోమవారం జలసౌధలో సమీక్ష నిర్వహించారు.

తరువాయి2లో

## 1,050 సినిమాల పైరసీ.. రూ.22,400 కోట్ల నష్టం




- ఐదుగురిని అరెస్టు చేసిన హైదరాబాద్ పోలీసులు
- రెండు రకాలుగా ముఠాల దందా
- డిజిటల్ మీడియా కంపెనీల సర్వర్ల హ్యాకింగ్
- థియేటర్లలో చిన్న కెమెరాల ద్వారా రికార్డింగ్
- వ్యవస్థీకృతంగా సాగుతున్న దందా
- పైరసీతో రూ.22,400 కోట్ల నష్టం: నగర పోలీస్ కమిషనర్ ఆనంద్
- సినీ ప్రముఖులతో ప్రత్యేక భేటీ

ఈకబురు, హైదరాబాద్(బంజారాహిల్స్): దేశంలోనే అతిపెద్ద సినీ పైరసీ గుట్టురట్టు చేశారు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు. పైరసీకి సంబంధించి కీలక ఆధారాలు సేకరించారు. ఈ వ్యవహారం జరుగుతున్న విధానం, మార్కెటింగ్, ఆర్థిక లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు చేపట్టారు. ఐదేళ్లలో 1,050 సినిమాలను పైరసీ చేసిన ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సోమవారం ప్రకటించారు. వీరిలో ఓ నిందితుడు మూడేళ్లలో 550 సినిమాలు పైరసీ చేయగా... నలుగురితో కూడిన ముఠా ఐదేళ్లలో 500 సినిమాలు చేసినట్లు గుర్తించామన్నారు. ఈ పైరసీతో చిత్ర పరిశ్రమకు రూ.22,400 కోట్ల నష్టం వాటిల్లిందని చెప్పారు. ఈ మేరకు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో కలిసి సీవీ ఆనంద్ తన కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు.

తరువాయి6లో

## విదేశీ సినిమాలపై 100శాతం టారిఫ్



- ఫర్నిచర్‌పైనా సుంకాల పెంపు.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన
- భారత చిత్ర పరిశ్రమపై ప్రభావం
- నెట్‌ఫ్లిక్స్ షేరు ధరలో 1.5%తగ్గుదల

తరువాయి2లో

## శ్రీశైలానికి 6.21లక్షల క్యూసెక్కుల వరదఆందోళన.. ఉద్రిక్తత

» 10 గేట్లు ఎత్తి 5.93 లక్షల క్యూసెక్కుల విడుదల

» భద్రాచలం వద్ద 45 అడుగులకు చేరిన గోదావరి

» 3లో



మొదటి పేజీ తరువాయి

# బతుకమ్మ వైభవం



ఈకబురు, హైదరాబాద్: 'ఒక్కేసి పువ్వేసి చందమామ..'' అంటూ అతివలు ఆడిపాడిన బతుకమ్మ వేడుక గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించుకుంది. గిన్నిస్ రికార్డు సాధనే లక్ష్యంగా హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 63 అడుగుల ఎత్తు, 11 అడుగుల వెడల్పు, ఏడు టన్నుల పుష్పాలతో ఏర్పాటు చేసిన 'భారీ బతుకమ్మ'తో పాటు.. 1,354 మంది అతివలు భారీ బతుకమ్మ చుట్టూ చేరి లయబద్ధంగా ఆడినందుకు 'అతిపెద్ద జానపద నృత్యానికి' రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు దక్కాయి. దీనికి సంబంధించిన వివరాలను గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు వెల్లడించారు. ఆయా ధ్రువపత్రాలను మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్కకు అందజేశారు.

రాజ్‌భవన్‌లో బతుకమ్మ వద్ద పూజలు చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఆయన సతీమణి సుధాదేవ్ వర్మ, సిబ్బంది కుటుంబసభ్యులు

**బతుకమ్మ ఖ్యాతి ప్రపంచానికి చాటాం: మంత్రులు**

ఈ సందర్భంగా మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క మాట్లాడుతూ.. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రెండు నెలల నుంచి బతుకమ్మ వేడుకలకు ప్రణాళికలు చేశాం. గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కడంతో బతుకమ్మ ఖ్యాతిని ప్రపంచానికి చాటాం. గల్లీ నుంచి గ్లోబల్ వరకు రాష్ట్ర ఆడపడుచులు సత్తా చాటారు. వీరందరి జీవితాల్లో వెలుగులు నిండాలి' అని ఆకాంక్షించారు. అనంతరం గాయకులు పాడిన పాటలకు వేల సంఖ్యలో హాజరైన ఆడపడుచులు బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పర్యాటక శాఖ ఎండీ వల్లూరి క్రాంతి, సంగీత నాటక అకాడమీ, సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్‌లు అలేఖ్య పుంజాల, వెన్నెల గద్దర్, అరుణోదయ విమలక్క తదితరులు పాల్గొన్నారు.

మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావుకు ధ్రువపత్రం అందిస్తున్న గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధి. చిత్రంలో వల్లూరి క్రాంతి, విజయలక్ష్మి, మల్‌రెడ్డి రంగారెడ్డి, వెన్నెల గద్దర్, విమలక్క తదితరులు

**సందడి చేసిన ప్రపంచ సుందరి**

వేడుకలకు ప్రపంచ సుందరి ఓపల్ సుచాతతోపాటు, కాంటినెంటల్ డెలిగేట్స్ పాల్గొన్నారు. భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలా దుస్తులు ధరించి సందడి చేశారు. మంత్రులు, ఇతర మహిళా ప్రజాప్రతినిధులతో చుట్టూ చేరి బతుకమ్మ ఆడి ఉత్సాహపరిచారు.

**పుడమిపై పూల సింగిడి**

వరంగల్ సాంస్కృతికం, సోమాజిగూడ, హుస్నాబాద్, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ వేడుకలు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఆడపడుచులు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మకు పూజలు చేశారు. ఆటపాటలు, బృంద నృత్యాల అనంతరం జలాశయాల్లో నిమజ్జనం చేశారు. ఓరుగల్లులో సంబరాలు అంబరాన్నంటాయి. హనుమకొండలోని పద్మాక్షి గుండం, వడ్డేపల్లి బండ్, తదితర ప్రధాన కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన వేడుకలకు మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

రాజ్‌భవన్‌లో జరిగిన వేడుకల్లో ఉద్యోగులు, వారి కుటుంబాలతో కలిసి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఆయన సతీమణి సుధాదేవ్ వర్మ పాల్గొన్నారు. గవర్నర్ దంపతులు భక్తిశ్రద్ధలతో బతుకమ్మ ఆడి నిమజ్జనం చేశారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల సతీమణులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# విదేశీ సినిమాలపై 100శాతం టారిఫ్



ఈ-కబురు, : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం మరోసారి టారిఫ్‌ల కొరడా ఝుళిపించారు. ఈసారి విదేశీ సినిమాలపై సుంకాలను 100౹ మేర పెంచారు. విదేశీ ఫర్నిచర్‌పైనా సుంకాలను పెంచనున్నట్టు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలను తర్వాత ప్రకటిస్తామని తెలిపారు. వినోద, తయారీ రంగాల ఉద్యోగాలను తిరిగి అమెరికాకు తీసుకొచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో పోస్టులు పెట్టారు. హాలీవుడ్‌పై దృష్టి సారించిన ఆయన విదేశీ పోటీదార్ల కారణంగా సినిమా పరిశ్రమపై అమెరికా ఆధిపత్యం తగ్గిందని అభిప్రాయపడ్డారు. "మన సినీ నిర్మాణ వ్యాపారాన్ని ఇతర దేశాలు దొంగిలించాయి. చిన్న పిల్లల చేతిలోని క్యాండీని లాక్కొన్నట్టు తీసుకెళ్లిపోయాయి. ముఖ్యంగా బలహీన, అసమర్థ గవర్నర్ కారణంగా కాలిఫోర్నియా నష్టపోయింది. చిరకాలంగా, ముగింపంటూ లేకుండా సాగుతున్న ఈ సమస్యను పరిష్కరించడానికి అమెరికా బయట నిర్మించిన అన్ని సినిమాలపై 100౹టారిఫ్ విధించాలని ప్రతిపాదిస్తున్నా" అని పేర్కొన్నారు. తర్వాత మరో పోస్టు పెడుతూ ఒకప్పుడు ఫర్నిచర్ తయారీ రంగంలో ఒక వెలుగువెలిగిన నార్త్ కరోలినా రాష్ట్రానికి పూర్వ వైభవం తెచ్చేందుకు విదేశీ ఫర్నిచర్‌పై టారిఫ్‌లు పెంచుతామని తెలిపారు. "చైనా, ఇతర దేశాల కారణంగా నార్త్ కరోలినా ఫర్నిచర్ వ్యాపారాన్ని పూర్తిగా కోల్పోయింది. ఆ రాష్ట్రాన్ని మళ్లీ 'గ్రేట్'గా మార్చేందుకు అమెరికాలో తయారుచేయని ఫర్నిచర్‌పై టారిఫ్‌లు పెంచుతాం" అని పేర్కొన్నారు. ట్రంప్ నిర్ణయం భారత సినీ పరిశ్రమపై భారీగా ప్రభావం చూపనుంది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం అమెరికా, కెనడాల్లో ఏ సమయంలో చూసినా 1,000కిపైగా భారత భాషల సినిమాలు ఆడుతుంటాయి. భారత దేశ నిర్మాతలు, అమెరికా డిస్ట్రిబ్యూటర్లు కలిసి వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. అందువల్ల విదేశాల్లో నిర్మించిన సినిమాలపై 100౹ టారిఫ్ విధించే చట్టబద్ధమైన అధికారం అధ్యక్షుడికి ఉందా అన్నదానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, నెట్‌ఫ్లిక్స్ షేరు ధర 1.5౹ మేర తగ్గింది.

మొదటి పేజీ తరువాయి

# స్థానిక పోరుకు సైరన్



**మొత్తం ఐదు దశలు..**

స్థానిక ఎన్నికల ఒక్కో దశను 15 రోజుల్లోగా ముగించేలా చర్యలు చేపడుతున్నామని ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని చెప్పారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కార్యాలయంలో డీజీపీ జితేందర్, లా అండ్ ఆర్డర్ డీజీ మహేశ్ భగవత్, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, పీఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్ఈసీ కార్యదర్శి మంద మకరందలతో కలిసి ఆమె స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 31 జిల్లాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీల ఖాళీల వివరాలతో కూడిన గెజిట్‌ను అధికారులు విడుదల చేశారని తెలిపారు.

ఒక్కో దశకు ఆయా తేదీలను బట్టి ఎక్కడికక్కడ రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్లు విడుదల చేస్తారని చెప్పారు. ఇవి జారీ అయిన రోజు కలిపి మొత్తం మూడురోజుల పాటు అభ్యర్థులు నామినేషన్ల దాఖలు చేసేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. హైకోర్టు స్టే ఉత్తర్వులకారణంగా..14 ఎంపీటీసీ, 27 గ్రామపంచాయతీలు, 246 వార్డులకు ఎన్నికలు జరపడం లేదన్నారు. ములుగు జిల్లా మంగపేట మండలంలోని 14 ఎంపీటీసీ స్థానాలు, 25 గ్రామపంచాయతీలు, 230 వార్డులకు, కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని కుర్మపల్లి, రామచంద్రాపూర్ పంచాయతీలు, వీటిలోని 16 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం లేదని కమిషనర్ తెలియజేశారు.

# జీఎస్టీ తగ్గింపుతో పెరిగిన పొదుపు



**ఒక్కో కుటుంబానికి ఏటా రూ.20వేలు ఆదా: ప్రధాని మోదీ**

ఈకబురు, న్యూఢిల్లీ : వస్తుసేవల పన్ను (జీఎస్టీ) విషయంలో ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను ప్రధాని మోదీ సమర్థించుకున్నారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడుతూ 'ప్రగల్భాలు పలికేవారి' (బయాన్ బహదూర్) మాటలకేమిగానీ జీఎస్టీ తగ్గింపు కారణంగా ప్రజలకు సొమ్ము ఆదా అయిందని చెప్పారు. యూపీఏ పాలనతో పోల్చినప్పుడు సంవత్సరానికి రూ.లక్ష వ్యయం చేసే కుటుంబం ప్రస్తుతం రూ.20వేలను మిగుల్చుకోగలుగుతోందని చెప్పారు. సోమవారం ప్రధాని మోదీ ఇక్కడ బీజేపీ ఢిల్లీ శాఖ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ జీఎస్టీ తగ్గింపుతో పాటు ఆదాయపు పన్నులో మినహాయింపులు ఇచ్చిన కారణంగా ప్రతియేటా ఒక్కో కుటుంబానికి రూ.2.5 లక్షల మేర ఆదా అవుతోందని తెలిపారు. ఈ సంస్కరణలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ముఖ్యంగా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో ప్రచారం చేయాలని కార్యకర్తలను కోరారు.

# ఇంటింటికీ 'బాకీ కార్డు'



ఈకబురు, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగడంతో భారత రాష్ట్ర సమితి పోరుకు సన్నద్ధమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై నిలదీసేందుకు సమాయత్తమవుతోంది. ఈ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను గెలవడం ద్వారా సత్తా చాటాలని భావిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలను, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని పేర్కొంటూ.. ఇటీవల భారత రాష్ట్ర సమితి విడుదల చేసిన 'బాకీ కార్డు'ను రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారంలోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది. ఇంటింటికీ బాకీ కార్డు నినాదంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో దీన్ని ప్రధాన అస్త్రంగా వాడుకోవాలని భావిస్తోంది. ఇందుకోసం 4 కోట్ల కార్డులను ముద్రించడానికి ఏర్పాట్లు చేసింది. ప్రధానంగా గ్రామీణ తెలంగాణలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కార్డు రూపంలో ప్రచారం చేపట్టనుంది. ఇటీవల యూరియా కొరతతో రైతులు ఎదుర్కొన్న ఇక్కట్లను స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అన్నదాతలకు మరోసారి గుర్తు చేయనుంది. మహిళలకు రూ.2,500, పింఛను రూ.4,000, నిరుద్యోగ భృతి, గ్రామాల్లో అపరిశుభ్రత తదితర అంశాలను ఎన్నికల ప్రచార ఎజెండాలో చేర్చింది.

**అధినేత దిశానిర్దేశం**

భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ 'స్థానిక' ఎన్నికల సన్నద్ధత.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్కారుకు తగిన గుణపాఠం చెబుతారని, ఈ నేపథ్యంలో గులాబీ శ్రేణులను స్థానిక ఎన్నికలకు సన్నద్ధం చేయాలని ఆయన మార్గనిర్దేశం చేయడంతో.. ఆ దిశగా భారత రాష్ట్ర సమితి కార్యాచరణను రూపొందించింది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, సీనియర్ నేత టి. హరీశ్‌రావులు విస్తృతంగా పర్యటించాలని నిర్ణయించారు. అన్ని నియోజకవర్గాల్లోనూ స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో సమన్వయం చేసుకొని పార్టీ తరపున పోటీ చేయనున్న జడ్పీటీసీ అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఎంపికైనవారికి హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో అధినేత కేసీఆర్ చేతుల మీదుగా బీఫారాలను అందజేసే అవకాశమున్నట్లు భారత రాష్ట్ర సమితి వర్గాలు తెలిపాయి. కొన్ని జడ్పీటీసీ స్థానాలకు.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన వారిని, మరికొన్ని చోట్ల భారత రాష్ట్ర సమితి కీలక నేతల కుమారులు, సతీమణి, ఇతర కుటుంబ సభ్యులను రంగంలోకి దించాలని పార్టీ భావిస్తోంది. తద్వారా ఆయా స్థానాల్లో అభ్యర్థుల గెలుపును ప్రభావితం చేసేలా.. తద్వారా అత్యధిక జడ్పీ ఛైర్మన్ స్థానాలను దక్కించుకోవాలని భారత రాష్ట్ర సమితి యోచిస్తోంది. సర్పంచి అభ్యర్థులను మాత్రం స్థానిక ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జులే ఎంపిక చేసే బాధ్యతను అధిష్ఠానం అప్పగించింది.

# ఆల్మట్టిపై సుప్రీంలో పోరాటం




ఈకబురు, హైదరాబాద్: ఎగువ కృష్ణా నదిపై కర్ణాటకలో నిర్మించిన ఆల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో బలంగా పోరాడాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర వాటాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ (జనరల్) అంజాద్ హుసేన్, సలహాదారులు ఆదిత్యనాథ్ దాస్‌తో మంత్రి సోమవారం జలసౌధలో సమీక్ష నిర్వహించారు.

తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణం కోసం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు సవరణ డీపీఆర్ రూపకల్పనను వేగిరం చేయాలన్నారు. మంత్రివర్గ సమావేశంలో తీర్మానించిన వెంటనే ఎస్ఎల్‌బీసీ సొరంగం నిర్మాణ పనులు పునరుద్ధరించాలని ఆదేశించారు. కల్వకుర్తి, దేవాదుల ప్యాకేజీ-6 పనుల సవరణ అంచనాలతోపాటు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు, ఖమ్మంలోని నీటిపారుదల శాఖ భూములకు సంబంధించిన ఫైళ్లను మంత్రివర్గ సమావేశం ముందు పెట్టేందుకు సిద్ధం చేయాలని చెప్పారు.

'కేటీఆర్ ఆల్మట్టి ప్రాజెక్టుపై పిచ్చిగా మాట్లాడుతున్నారు. రాజకీయ లబ్ధి కోసం అడ్డగోలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచొద్దని సుప్రీంకోర్టు స్టే అమల్లో ఉంది' అని ఉత్తమ్ అన్నారు. సుప్రీంకోర్టులో వాదనల కోసం సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌ను నియమించామని చెప్పారు.

**త్వరలో నీటి వినియోగ సంఘాలు**

క్రమపద్ధతిలో చెరువులు, కాల్వల నిర్వహణ కోసం స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా నీటి వినియోగ సంఘాలను ఏర్పాటు చేయనున్నామని మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. తొలుత చెరువుల నిర్వహణకు వీటిని ఏర్పాటు చేసి క్రమంగా భారీ ప్రాజెక్టులకు విస్తరింపజేస్తామన్నారు. ప్రతి సంఘానికి సహాయకుడిగా లస్కర్‌తోపాటు కన్వీనర్‌గా నీటిపారుదల శాఖ అధికారిని నియమిస్తామన్నారు.

జవాబుదారీతనంతో ముందస్తు చర్యలు తీసుకునే యంత్రాంగం ఉండి ఉంటే చాలా చెరువులకు గండ్లతో పాటు ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యాలను నిలువరించగలిగేవారమని ఇటీవల కురిసిన భారీ వర్షాల సమయంలో గుర్తించామన్నారు. నీటి వినియోగ సంఘాలతో ఈ కొరతను తీర్చడంతో పాటు సాగునీటి వనరుల నిర్వహణ బాధ్యతల్లో స్థానికులకు చోటు కల్పించనున్నాయన్నారు. రైతులకు తగిన ప్రాతినిధ్యం కల్పించడానికి తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండ రెడ్డి, సభ్యులను సంప్రదించి సంఘాలను నియమించాలనే ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయన్నారు. చెరువులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో వర్షాకాలంలో వాటికి గండ్లుపడి రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని రైతు కమిషన్ చెప్పిందన్నారు. ఇందుకోసం నీటి వినియోగ సంఘాలను ఏర్పాటు చేసి లస్కర్లతోపాటు ఇతర వనరులను కల్పించాలని విజ్ఞప్తి చేసిందన్నారు. చెరువులు, కాల్వలను పటిష్టంగా ఉంచడంలో రైతులకు నీటి వినియోగ సంఘాలు భరోసా కల్పిస్తాయని ఉత్తమ్ అన్నారు. కొత్త విధానంతో క్షేత్రస్థాయిలో బాధ్యతల పునరుద్ధరణతోపాటు గండ్లుపడకముందే నివారణ చర్యలు సాధ్యమవుతాయన్నారు. సాగునీటి వనరులకు తొలి రక్షణ కవచంగా సంఘాలు వ్యవహరిస్తూ అత్యవసర మరమ్మతుల అవసరం లేకుండా చర్యలు తీసుకుని పంటలను కాపాడతాయన్నారు.

# రాయదుర్గంలో బిఆర్ఎస్ శ్రేణుల నిరసన

**అరెస్టు చేసిన పోలీసులు**

**రాయదుర్గం - శంషాబాద్ మెట్రో రద్దు నిర్ణయం హేయం : కొమిరిశెట్టి సాయిబాబా**

ఈకబురు, శేరిలింగంపల్లి : రాయదుర్గం నుంచి శంషాబాద్ వరకు మెట్రో రెండో దశ విస్తరణ పనులను అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రద్దు చేసి, నియో పోలీస్ వరకే కుదించడంపై బిఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ శంకుస్థాపన చేపట్టిన రెండో దశ విస్తరణ పనుల శిలాఫలకాన్ని ధ్వంసం చేయడంపై నిరసన వ్యక్తం చేశారు. రాయదుర్గం మైండ్ స్పేస్ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పట్లోళ్ల కార్తీకరెడ్డి. గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాలను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... మెట్రో రెండో దశ విస్తరణలో భాగంగా రాయదుర్గం మైండ్ స్పేస్ చైరస్తా నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గతంలో శంకుస్థావన చేసిన విషయం తెలిసిందే. కాగా అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మార్గాన్ని రద్దు చేసి రాయదుర్గం నుంచి నియో పోలీస్ వరకే ఈ మార్గాన్ని కుదించి, మరోమార్గం గుండా శంషాబాద్ కు మెట్రో విస్తరణ కోసం సిద్ధమైంది. కాగా కెసిఆర్ శంకుస్థావన చేసిన శిలాఫలకాన్ని కూల్చివేసి, దాన్ని స్థానంలో నిర్మాణ సంస్థలు నిర్మాణాలు చేపట్టేందుకు పనులు చేపట్టడంతో బిఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నారు. బిఆర్ఎస్ శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో శిలాఫలకం శుద్ధి, నిరసన ప్రదర్శనకు పిలుపునివ్వగా, ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హాజరయ్యారు. సోమవారం మైండ్ స్పేస్ చౌరస్తా వద్ద నిరసన తెలిసేందుకు ప్రయత్నించిన కార్తీక్ రెడ్డి, కొమిరిశెట్టి సాయిబాబాలను పోలీసులు అరెస్టు చేశారు. వీరితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి మాదాపూర్, రాయదుర్గం, గచ్చిబౌలి, నార్సింగి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా కొమిరిశెట్టి సాయిబాబా మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం శంకుస్థావన చేసిన మెట్రో రెండో దశ పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడం హేయమైన చర్య అన్నారు. నగరానికి తలమానికమైన ఐటి కారిడార్ ను ఎయిర్ పోర్టుకు కలువుతూ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చేపట్టిన ఈ ప్రాజెక్టును రద్దు చేయడం అనాలోచిత నిర్ణయమని అన్నారు. శంకుస్థావన చేసిన శిలాఫలకాన్ని సైతం ధ్వంసం చేసి నిర్మాణాలు చేపడుతున్నారని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్తీక్ రెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు



కార్తీక్ రెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు



కొమిరిశెట్టి సాయిబాబాను పోలీసులు అరెస్టు చేస్తున్న దృశ్యం

మొదటి పేజీ తరువాయి

## ఇది ఆత్మకథ కాదు.. మీ మన్ కీ బాత్



ఈ-కబురు, న్యూఢిల్లీ : ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆత్మకథకు ప్రధాని మోదీ రాసిన ముందుమాట ఆసక్తికరంగా మారింది. 'అయాం జార్జియా-మై రూట్స్, మై ప్రిన్సిపుల్స్' అనే ఈ పుస్తకం కేవలం ఆత్మకథ కాదని.. ఆమె 'మన్ కీ బాత్ (మనసులో మాట)' అని పేర్కొన్నారు. 'ప్రధాని మెలోనీ ఆత్మకథ రాస్తుండడం నాకు సంతోషం కలిగిస్తోంది. 11 ఏళ్లుగా పలువురు ప్రపంచ నేతలతో కలిసి నడిచే అవకాశం నాకు కలిగింది. ఒక్కొక్కరిదీ ఒక్కో విధమైన జీవనయానం. కాలక్రమంలో అవి వ్యక్తిగత కథలను మించిన విస్తృతార్థాన్ని ఇస్తాయి. శతాబ్దాల తరబడి భిన్న సంస్కృతుల్లో నెలకొన్న విలువలను గుర్తుచేస్తాయి. తన పరిపూర్ణ జీవనంలో ప్రధాని మెలోనీకి ఇలాంటి దృష్టాంతాలు ఎన్నో ఎదురై ఉంటాయి' అని పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## వారు కాంగ్రెస్‌లో చేరడం ప్రత్యక్షంగా చూశారా?



ఈకబురు,హైదరాబాద్: "భారత రాష్ట్ర సమితి నుంచి కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడాన్ని మీరు ప్రత్యక్షంగా చూశారా? ఆ సమయంలో మీరు అక్కడ ఉన్నారా? మీరు అక్కడ లేనప్పుడు.. మీడియాలో వచ్చిన కథనాలను ఆధారాలుగా ఎలా చూపుతారు?" అని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, చింతా ప్రభాకర్‌లను శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, కాలే యాదయ్య, గూడెం మహిపాల్‌రెడ్డిల తరఫు న్యాయవాదులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఫిర్యాదు చేసిన ఒక్కో ఎమ్మెల్యేను వారు సుమారు 3540 ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. భారత రాష్ట్ర సమితి నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించారంటూ బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిపై పల్లా రాజేశ్వర్‌రెడ్డి... అరెకపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్‌లపై కల్వకుంట్ల సంజయ్... పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌లపై జగదీశ్‌రెడ్డి... గూడెం మహిపాల్‌రెడ్డి, కాలే యాదయ్యలపై చింతా ప్రభాకర్... తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరిలపై కేపీ వివేకానంద... దానం నాగేందర్‌పై పాడి కౌశిక్‌రెడ్డి గతంలో అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. వీటిపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో సోమవారం విచారణ ప్రారంభించారు. ఫిరాయింపులపై ఫిర్యాదు చేసిన భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేల తరఫు న్యాయవాదులు కూడా దీనికి హాజరయ్యారు. అన్నీ అవాస్తవాలు.. కాదు, ఆ ఆధారాలు నిజాలే.. తొలుత ఫిర్యాదు చేసిన భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, చింతా ప్రభాకర్‌లను.. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, కాలే యాదయ్య, మహిపాల్‌రెడ్డిల తరఫు న్యాయవాదులు వేర్వేరుగా క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. "పార్టీ ఫిరాయింపులపై మీరు చేసిన ఫిర్యాదులు వాస్తవం కాదు. ఆధారాలూ సరైనవి కావు. ముఖ్యమంత్రిని అన్ని పార్టీల ఎమ్మెల్యేలు కలుస్తుంటారు. ఈ ఎమ్మెల్యే కూడా తమ నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం కలిశారు. అందరూ చూస్తుండగానే కలిశారు కదా? అందులో తప్పేముంది? మీరు అక్కడ ప్రత్యక్షంగా లేరు. పార్టీ మారినట్లుగా మీరు స్వయంగా చూడలేదు. టీవీ ఛానెళ్లు, పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాలను ఆధారాలుగా చూపితే అవి ఎలా చెల్లుబాటు అవుతాయి? మీ పార్టీ నుంచి ఫిరాయింపులకు పాల్పడినట్లుగా భావిస్తే.. షోకాజ్ నోటీసులు ఏమైనా ఇచ్చారా? పార్టీ అంతర్గత సమావేశాలకు పిలుస్తున్నారా?" అని న్యాయవాదులు ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలుస్తోంది. పార్టీ మారినట్లుగా సమర్పించిన ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసినట్లుగా ఉన్నాయని ఒక దశలో న్యాయవాదులు పేర్కొనగా... దీనిపై భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. "పార్టీ ఫిరాయింపులకు పాల్పడినట్లుగా మేము ప్రత్యక్షంగా చూడలేదు. అయినా, వారు ముఖ్యమంత్రి సమక్షంలో పార్టీ మారారు. వారే స్వయంగా మీడియాతో చెప్పారు. తమ సామాజిక మాధ్యమ వేదికల్లోనూ పోస్టులు పెట్టారు. సీఎంతో ఉన్న ఫొటోలను మార్ఫింగ్ అని ఎలా అంటారు? సీఎం ఫొటోలను మార్ఫింగ్ చేయడం నేరపూరిత చర్య. ప్రభుత్వం దీన్ని మార్ఫింగ్‌గా భావిస్తే.. చట్టపరంగా విచారణకు ఆదేశించాలి. మేము సమర్పించిన ఆధారాలన్నీ వాస్తవాలే" అని పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, చింతా ప్రభాకర్ స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. అసెంబ్లీలో కేటీఆర్‌ను బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కలిశారని ఆయన తరఫు న్యాయవాది పేర్కొనగా... శాసనసభ సమావేశాల సందర్భంగా అనేకమంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మర్యాదపూర్వకంగా కలుస్తుంటారని, కేటీఆర్‌ను కలిసినంత మాత్రాన అది పార్టీ ఫిరాయింపులకు పాల్పడలేదని ధ్రువీకరించినట్లు కాదని పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెప్పినట్లు సమాచారం. 'భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ తమ పార్టీ ఎమ్మెల్యేలను కలుస్తున్నారా? అసెంబ్లీకి వస్తున్నారా?' వంటి ప్రశ్నలను న్యాయవాదులు సంధించగా.. అది ఈ విచారణకు సంబంధం లేని అంశమని, అనవసర ప్రశ్నలతో తప్పుదోవ పట్టించవద్దని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలిపినట్లు తెలిసింది. సభాపతి సమక్షంలో జరిగిన విచారణ అంశాలను శాసనసభ అధికారులు నోట్ చేసుకున్నారు.

పార్టీ ఫిరాయింపు నోటీసులు స్వీకరించిన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, కాలే యాదయ్య, గూడెం మహిపాల్‌రెడ్డిలను వారిపై ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేల తరఫు న్యాయవాదులు బుధవారం క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తారు. మిగిలిన ఆరుగురిలో దానం నాగేందర్, కడియం శ్రీహరి ఇప్పటివరకూ స్పీకర్‌కు వివరణ ఇవ్వలేదని తెలిసింది. అరెకపూడి గాంధీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్, తెల్లం వెంకట్రావ్‌లను, వారిపై ఫిర్యాదు చేసిన డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జగదీశ్‌రెడ్డి, కేపీ వివేకానందలను విచారించాల్సి ఉంది. వచ్చే నెల 6వ తేదీ నుంచి 23 వరకు స్పీకర్ విదేశీ పర్యటనకు వెళ్లనుండటంతో.. 5వ తేదీలోగా విచారణను పూర్తి చేస్తారా? విదేశీ పర్యటన నుంచి తిరిగివచ్చాక విచారణ తేదీలను ప్రకటిస్తారా? అనేది ఇంకా స్పష్టం కాలేదు.

**అసంబద్ధ ప్రశ్నలు వేసినా ఓపికగా సమాధానాలిచ్చాం: పల్లా, సంజయ్, ప్రభాకర్**

10 మంది భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరిన విషయం బహిరంగ రహస్యమని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, చింత ప్రభాకర్ పేర్కొన్నారు. స్పీకర్ సమక్షంలో న్యాయ విచారణ ముగిసిన అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వారు మాట్లాడారు. "ఫిరాయింపు ఎమ్మెల్యేల తరఫున వచ్చిన న్యాయవాదులు అసంబద్ధ ప్రశ్నలు వేశారు. అయినా ఓపికగా సమాధానం చెప్పాం. ఫిరాయించినవారిపై అనర్హత వేటు వేయాలని స్పష్టంగా చెప్పాం. ఫిరాయింపు ఎమ్మెల్యేలను మా న్యాయవాదులు అక్టోబరు 1న క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తారు" అని తెలిపారు.

## పిటా' అమలుకు ప్రత్యేక అధికారులను నియమించండి

ఈకబురు,హైదరాబాద్: మానవ అక్రమ రవాణా నిరోధక చట్టం (పిటా) కింద సంబంధిత ప్రాంతాలను నిర్దేశిస్తూ ప్రత్యేక అధికారుల నియామకం చేపట్టాలని డీజీపీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇన్‌స్పెక్టర్ స్థాయికంటే తక్కువ కాకుండా ప్రత్యేక అధికారి నియామకం ఉండాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా చట్టప్రకారం నోటిఫికేషన్ జారీ చేసి, నియామక ప్రక్రియ చేపట్టాలనీ.. ఈ ప్రక్రియ 4 వారాల్లో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. పిటా చట్ట ప్రకారం దాడులు, సోదాలు, జప్తు చేసే అధికారం ఎస్సై స్థాయి అధికారికి లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారని, మహిళలను వాణిజ్య లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారన్న ఫిర్యాదు ఆధారంగా బ్లూబెల్స్ స్పా ప్రాంగణంపై పంజాగుట్ట ఎస్సై దాడులు నిర్వహించి ఫోన్‌లు తదితరాలు జప్తు చేసి కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలంటూ బ్లూబెల్స్‌లో మేనేజర్‌గా ఉన్న మహిళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ విచారణ చేపట్టి ఇటీవల తీర్పు వెలువరించారు. ప్రస్తుత కేసులో ఎస్సై దాడులు నిర్వహించి కేసు నమోదు చేయడం చెల్లదన్నారు. చట్టంలో పేర్కొన్న విధానానికి విరుద్ధంగా నమోదు చేసిన కేసును కొట్టివేశారు.

## నాలుగేళ్ల ఆర్టీసీ ప్రయాణం సంతృప్తినిచ్చింది



ఈ-కబురు,హైదరాబాద్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)కు నాలుగేళ్లు సేవలు అందించడం సంతృప్తినిచ్చిందని, సమష్టికృషితో సంస్థలో వినూత్న కార్యక్రమాలు చేపట్టి విజయవంతం చేశామని మాజీ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. సోమవారం సజ్జనార్‌కు ఆర్టీసీ సంస్థ అధికారులు, సిబ్బంది వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంతకాలం తనకు సహకరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. సజ్జనార్ వీడ్కోలు తీసుకున్న సందర్భంగా 'ఎక్స్'లో ఆసక్తికర పోస్ట్ చేశారు. 'నా స్టాప్ వచ్చేసింది. బస్సు దిగి, కొత్త మార్గంలో పయనించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రయాణాలు ఆగుతాయి, ప్రయాణికులు ముందుకు కదులుతారు. కానీ రహదారి ఎల్లప్పుడు ముందుకు సాగుతూనే ఉంటుంది' అని పేర్కొన్నారు. టీజీఎస్ఆర్టీసీ ఎండీగా తన చివరి రోజున వీసీ సజ్జనార్ ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. లక్డీకాపూల్‌లోని టెలిఫోన్ భవన్ బస్టాండ్ నుంచి బస్ భవన్ వరకు 113 రూట్ బస్సులో టికెట్ తీసుకుని ప్రయాణించారు.

**నూతన ఎండీగా నాగిరెడ్డి బాధ్యతలు**

వై.నాగిరెడ్డి ఆర్టీసీ నూతన ఎండీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూప్రజలకు మెరుగైన ప్రజా రవాణా అందించడమే కర్తవ్యమని తెలిపారు.

## శ్రీశైలానికి 6.21లక్షల క్యూసెక్కుల వరద



ఈ-కబురు,హైదరాబాద్: కృష్ణ, గోదావరి నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కృష్ణా బేసిన్‌లో ఎగువన ఆల్మట్టి ప్రాజెక్టుకు 1.07 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 1.10 లక్షల క్యూసెక్కులను, జూరాలకు 5.37 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 39 గేట్లను ఎత్తి 5.60 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల, తుంగభద్ర ప్రాజెక్టుల నుంచి సోమవారం శ్రీశైలం ప్రాజెక్టుకు 6.21 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పది గేట్లను 23 ఫీట్ల మేర ఎత్తి 5,93లక్షల క్యూసెక్కులను సాగర్‌కు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 5.91 లక్షల క్యూసెక్కుల వరద రాగా... వచ్చింది వచ్చినట్లే 26 గేట్ల ద్వారా దిగువకు వదులుతున్నారు. పులిచింతల ప్రాజెక్టుకు 5.92 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా... ఔట్‌ఫ్లో 5.69 లక్షల క్యూసెక్కులుగా ఉంది. మరోవైపు, గోదావరి ఉగ్రరూపం దాల్చింది. మేడిగడ్డ బ్యారేజీ వద్ద అత్యధికంగా 11.37లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఇక, భద్రాచలం వద్ద సోమవారం సాయంత్రానికి గోదావరి నీటిమట్టం 45.5 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం 10,32,816 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోంది. ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయగా.. నీటి మట్టం 48 అడుగులు దాటితే రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు.

# భారత్‌కూ యూట్యూబ్

## ప్రీమియం లైట్.. నెలకు రూ.89కే!




గూగుల్‌కు చెందిన వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్.. ప్రీమియం లైట్ సబ్‌స్క్రిప్షన్‌ను భారత్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది. యూట్యూబ్ ప్రీమియం ఎక్కువ ధర అని భావించే వారికోసం అందుబాటు ధరలో ఈ ప్లాన్‌ను తెచ్చింది. ఇప్పటికే ప్రీమియం లైట్ సదుపాయం యూఎస్‌లో అందుబాటులో ఉంది.

యూట్యూబ్ ప్రీమియం లైట్ ప్లాన్ ధరను నెలకు రూ.89గా నిర్ణయించారు. ప్రస్తుతం ఇదే ధరకు యూట్యూబ్ ప్రీమియం స్టూడెంట్ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ అందుబాటులో ఉంది. ఈ ప్లాన్‌లో గేమింగ్, ఫ్యాషన్, బ్యూటీ వంటి కేటగిరీలకు చెందిన 'చాలా వరకు' వీడియోలకు యాడ్‌ఫ్రీ ఎక్స్‌పీరియన్స్ లభిస్తుందని యూట్యూబ్ తన బ్లాగ్‌పోస్ట్‌లో పేర్కొంది. అయితే, 'మోస్ట్' అని పేర్కొందే తప్ప.. ఏయే వీడియోలకు వర్తిస్తుందనే విషయాన్ని స్పష్టంచేయలేదు. మ్యూజిక్, షార్ట్స్ కంటెంట్‌కు యాడ్స్ చూపిస్తోంది.

అలాగే, యూట్యూబ్ ప్రీమియం మాదిరిగా లైట్ ప్లాన్‌లో బ్యాగ్రౌండ్‌లో కంటెంట్‌ను వీక్షించడం, డౌన్‌లోడ్ చేసుకోవడం కుదరదు. పైగా లైట్ సబ్‌స్క్రిప్షన్ కేవలం యూట్యూబ్ ప్రధాన యాప్‌నకు మాత్రమే వర్తిస్తుంది. యూట్యూబ్ మ్యూజిక్‌కు వర్తించదు. ఫోన్లతో పాటు ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌టీవీలు ఇలా ఏ డివైజ్‌లోనైనా లైట్‌ప్లాన్ పనిచేస్తుంది. ప్రస్తుతం యూట్యూబ్ ప్రీమియం ఏడాది ప్లాన్ రూ.1490గా ఉంది. నెలకైతే రూ.149 చొప్పున చెల్లించాలి. నెలకు రూ.299, రూ.219 అద్దె ప్రాతిపదికన ఫ్యామిలీ ప్లాన్‌లను కూడా విక్రయిస్తోంది.

# భారత రేటింగ్ 'బీఏఏ3'



దిల్లీ: భారత్‌కున్న బలమైన ఆర్థిక మూలాల కారణంగా ప్రస్తుత రేటింగ్‌ను కొనసాగిస్తున్నట్లు అంతర్జాతీయ ఏజెన్సీ మూడీస్ పేర్కొంది. భారత దీర్ఘకాలిక దేశీయ, విదేశ కరెన్సీ ఇష్యూయర్ రేటింగ్స్, దేశీయ కరెన్సీ అన్‌సెక్యూర్డ్ రేటింగ్‌ను 'బీఏఏ3'గా నిర్ణయించింది. బలమైన ఆర్థిక వృద్ధి కారణంగా భవిష్యత్తు అంచనాలనూ 'స్థిరం'గా కొనసాగించింది. ఇతర స్వల్పకాల దేశీయ రేటింగ్‌ను పీ-3 వద్ద ఉంచింది. 'భారత్ తన క్రెడిట్ బలాన్ని కొనసాగిస్తోంది. అత్యంత వేగవంతమైన, బలమైన ఆర్థిక వ్యవస్థ, మెరుగైన విదేశీ మారకపు ద్రవ్యం, దేశీయంగా స్థిరమైన ద్రవ్య పరిస్థితులు ఉండడంతో రేటింగ్‌ను కొనసాగిస్తున్న'ట్లు మూడీస్ వివరించింది. అమెరికా టారిఫ్‌లు, ఇతర అంతర్జాతీయ విధాన చర్యల నేపథ్యంలో.. అనిశ్చితులు ఉన్నా భారత్‌కున్న ఈ బలాల వల్ల తయారీలోకి పెట్టుబడులను ఆకర్షించగలుగుతోందని తెలిపింది.

బలమైన జీడీపీ వృద్ధి, ద్రవ్య స్థిరీకరణ కారణంగా చాలా నెమ్మదిగా ప్రభుత్వానికున్న అధిక రుణ భారం తగ్గుతోంది. ప్రైవేటు వినియోగం పెంచడం కోసం ఇటీవల తీసుకున్న చర్యల వల్ల ప్రభుత్వ ఆదాయం తగ్గనుంది. రుణభారం ఎక్కువగా తగ్గే వీలులేదు. ఆసియా పసిఫిక్ (15-20%) ప్రాంతంతో పోలిస్తే భారత్‌పై అమెరికా విధించిన అధిక సుంకాల (50%) వల్ల భారత ఆర్థిక వృద్ధిపై పరిమిత ప్రతికూల ప్రభావమే ఉండొచ్చు. దీని వల్ల మధ్య-దీర్ఘకాలంలో అధిక విలువ జోడించిన తయారీ ఎగుమతులు చేయాలన్న భారత లక్ష్యాలకు ఇబ్బంది కలగొచ్చు.

అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం ఫలిస్తే, సుంకాలు తగ్గుతాయి. ఇతర విధానాల్లో (వీసా ఫీజులు) మార్పులు ఉండకపోవచ్చు.

ఇతర సంస్థలు ఇలా: ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ మాత్రం భారత రేటింగ్‌ను బీబీబీ- నుంచి బీబీబీకు ఆగస్టు 14న సవరించింది. ఇటీవల జపనీస్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ రేటింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ఫర్మేషన్(ఆర్ అండ్ ఐ) కూడా భారత దీర్ఘకాల సావరిన్ క్రెడిట్ రేటింగ్‌ను బీబీబీ నుంచి బీబీబీ+కు సవరించింది.

# ఐదేళ్లలో 3 లక్షల సేల్స్: మళ్ళీ తగ్గిన ధర



దేశీయ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా.. ఇండియన్ మార్కెట్లో తన థార్ (Mahindra Thar) ఎస్యూవీ లాంచ్ చేసినప్పటి నుంచి 3 లక్షలకు పైగా అమ్మకాలను నమోదు చేసింది. దీంతో ఈ ఆఫ్ రోడర్ సరికొత్త అమ్మకాల మైలురాయిని చేరుకుంది.

భారతదేశంలో మహీంద్రా థార్ అక్టోబర్ 2020లో ప్రారంభమైంది. అప్పటి నుంచి కేవలం ఐదు సంవత్సరాలలో మూడు లక్షల అమ్మకాల మైలురాయిని చేరుకుంది. ఇందులో థార్ రాక్స్ సేల్స్ కూడా ఉన్నాయి. దీనిని (థార్ రాక్స్) కంపెనీ సెప్టెంబర్ 2024లో లాంచ్ చేసింది.

2026 ఆర్థిక సంవత్సరం మొదటి 5 నెలల్లో జరిగిన మొత్తం థార్ అమ్మకాలలో.. థార్ రాక్స్ 68 శాతం వాటా కలిగి ఉంది. దీన్నిబట్టి చూస్తే.. దేశీయ విఫణిలో థార్ రాక్స్ అమ్మకాలు గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. ఈ కారు ధర కొత్త జీఎస్టీ అమలులోకి వచ్చిన తరువాత రూ. 1.35 లక్షలు తగ్గింది. ఇది అమ్మకాలను మరింత పెంచే అవకాశం ఉంది.

మహీంద్రా థార్ ధరలు రూ. 10.32 లక్షల నుంచి ప్రారంభమై.. రూ. 16.61 లక్షల (ఎక్స్‌షోరూమ్) వరకు ఉంటాయి. అదే సమయంలో, మహీంద్రా థార్ రాక్స్ ధరలు రూ. 12.25 లక్షల (ఎక్స్‌షోరూమ్) నుండి ప్రారంభమవుతాయి. ఈ కార్లు భద్రతలో కూడా మంచి స్కోరింగ్ పొందడంతో.. ఎక్కువ మంది వీటిని కొనుగోలు చేయడానికి ఎగబడుతున్నారు.

# కొత్త రూల్.. ఎలక్ట్రిక్ వాహనాలకు సౌండ్ తప్పనిసరి!



రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని.. 2027 అక్టోబర్ 1 నుంచి అన్ని ఎలక్ట్రిక్ కార్లు, బస్సులు, ట్రక్కులకు అకౌస్టిక్ వెహికల్ అలర్ట్ సిస్టమ్ (AVAS)ను తప్పనిసరి చేయాలని రోడ్డు రవాణా & రహదారుల మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది.

అక్టోబర్ 2026 తర్వాత.. తయారయ్యే అన్ని కొత్త ఎలక్ట్రిక్ వాహనాలు తప్పనిసరిగా ఈవీఏఎస్ కలిగి ఉండాలని మంత్రిత్వ శాఖ ఒక ముసాయిదా నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ సిస్టం వల్ల ఎలక్ట్రిక్ కారు కూడా సౌండ్ చేస్తుంది. ఈ సౌండ్ వల్ల కారును ఎవరైనా సులభంగా గుర్తించవచ్చు.

అమెరికా, జపాన్, కొన్ని యూరోపియన్ యూనియన్ దేశాలు ఇప్పటికే హైబ్రిడ్ వాహనాలలో AVAS వాడకాన్ని తప్పనిసరి చేశాయి. ఇది రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో సహాయపడుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రోడ్డు రవాణా & రహదారుల మంత్రిత్వ శాఖ ఇండియాలో కూడా ఈ విధానం అమలు చేయాలని సంకల్పించింది.

నిజానికి ఎలక్ట్రిక్ కార్లు.. ఫ్యూయెల్ కార్ల మాదిరిగా సౌండ్ చేయవు. దీనివల్ల ముందు వెళ్తున్న కారుకు లేదా వ్యక్తులకు వెనుక ఒక కారు వస్తుందనే విషయం తెలియకుండా పోతుంది. ఇలాంటి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకునే ఎలక్ట్రిక్ కార్లలో అకౌస్టిక్ వెహికల్ అలర్ట్ సిస్టమ్ ఉండాలని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

# వెండి @రూ. 1,50,000

**దేశీయంగా కొత్త గరిష్ట స్థాయి**

**తొమ్మిది నెలల్లో రూ.60,000 ప్లస్**

**రూ.1.20 లక్షలకు చేరిన పసిడి**

న్యూఢిల్లీ: వెండి ధర తారాజువ్వలా దూసుకుపోతోంది. ఢిల్లీ మార్కెట్లో సోమవారం కిలోకి మొదటిసారి రూ.1.5 లక్షలు పలికింది. ఒకే రోజు రూ.7,000 లాభపడింది. మరోవైపు పసిడి ధర సైతం (99.9 శాతం స్వచ్ఛత) 10 గ్రాములకు రూ. 1,500 పెరిగి రూ.1,19,500 వద్ద సరికొత్త జీవిత కాల గరిష్టాన్ని నమోదు చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో వెండి ఔన్స్ ధర (స్పాట్ మార్కెట్) 2 శాతం పెరిగి 47.18 డాలర్లకు చేరింది.

కామెక్స్ ఫ్యూచర్స్ మార్కెట్లో ఔన్స్ బంగారం 46 డాలర్లు పెరిగి 3,855 డాలర్ల వద్ద ట్రేడయ్యింది. విదేశీ మార్కెట్ల నుంచి బలమైన సంకేతాలతో దేశీ మార్కెట్లో వెండి, బంగారం ధరలు కొత్త రికార్డు స్థాయిలకు చేరినట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీ విభాగం సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. "స్పాట్ గోల్డ్ ధరలు వరుసగా ఆరో వారంలో నూ కొత్త రికార్డులకు చేరా యి. వాణిజ్య అనిశ్చితులకు తోడు ఫెడ్ రేటు కోత అంచనాలు, ఈటీఎఫ్‌ల్లోకి బలమైన పెట్టుబడుల రాక ఇందుకు మద్దతుగా నిలిచాయి"అని మిరే అస్సెట్ కమోడిటీస్ హెడ్ ప్రవీణ్‌సింగ్ చెప్పారు.

**వెండి 67 శాతం రాబడి..**

ఈ ఏడాది వెండి, పసిడి ధరల పెరుగుదల ఇన్వెస్టర్లు, విశ్లేషకుల అంచనాలకు మించి ఉండడం గమనార్హం. వెండి కిలోకి నికరంగా రూ.60,300 పెరిగింది. 2024 డిసెంబర్ చివరికి ఉన్న రూ.89,700 నుంచి చూస్తే 67% రాబడిని ఇచ్చింది. పసిడి ధర సైతం ఈ ఏడాది ఇప్పటి వరకు 10 గ్రాములకు రూ.40,550 పెరిగింది. గత డిసెంబర్ చివరికి ఉన్న రూ.78,950 నుంచి చూస్తే 51 శాతం ర్యాలీ చేసింది.



# అపజయం వెనుకే విజయం



**నార్త్‌లో దాండియా కల్చర్ బాగుంటుంది. చిన్నప్పుడు మేం ముంబైలో ఉండేవాళ్లం. దసరా టైమ్‌లో మా కమ్యూనిటీలో దాండియా ఆడేవాళ్లు. అలా మా అపార్ట్‌మెంట్‌వాళ్లతో కలిసి లైట్‌గా దాండియా చేసిన గుర్తు ఉంది. కానీ పెద్దయ్యాక దాండియా ఆడలేదు. అయితే చేయాలని ఉంది.**

పండగ అంటే ఫ్యామిలీ రీ యూనియన్ అని నా ఫీలింగ్. నా చిన్నప్పుడు మా బంధువులందరం కలిసి పండగ జరుపుకునేవాళ్లం. అందరూ కలిసి పండగ వంటలు చేయడం చాలా బాగుండేది. అయితే పై చదువులు, కెరీర్... వీటివల్ల రాను రాను ఆ సందడి తగ్గిపోయింది. ఇప్పుడైతే వర్క్‌లో బిజీ అయ్యాను కదా... షూటింగ్స్, ప్రమోషన్స్ ఉంటాయి కాబట్టి పండగ సమయంలో ఇంటి దగ్గర ఉండటం తగ్గిపోయింది. ఆ పాతరోజులను తలచుకుంటూ ఉంటాను.

''అపజయం ఎదురైనప్పుడు జీవితం ఆగిపోయింది అనుకుంటే మనం ఆగిపోతాం... ఆ అపజయాన్ని విజయానికి మెట్టుగా మార్చుకుంటే ముందుకు సాగిపోతాం'' అంటున్నారు శ్రీనిధి శెట్టి. అందాల పాటీల్లో 'మిస్ సుప్ర నేషనల్ ఇండియా' కిరీటం దక్కించుకోవడం నుంచి, 'మిస్ స్మైల్'... వరకు పలు టైటిల్స్ శ్రీనిధి సొంతం. తొలి చిత్రం 'కేజీ ఎఫ్'తో హీరోయిన్‌గా విజయవంతంగా కెరీర్ మొదలుపెట్టిన శ్రీనిధి శెట్టి ఇప్పుడు ఫుల్ బిజీ. ''ప్రతి స్త్రీ అమ్మవారిలా ఓ శక్తి స్వరూపిణి'' అంటూ 'దసరా' సందర్భంగా 'సాక్షి'తో శ్రీనిధి శెట్టి ప్రత్యేకంగా పంచుకున్న విశేషాలు.

మా మంగళూరులో చాలా టెంపుల్స్ ఉన్నాయి. నవరాత్రి సమయంలో గుడిలో జరిగే పూజలు చాలా వైభవంగా ఉంటాయి. ఈ దసరా టైమ్‌లో వీలైనప్పుడల్లా గుడికి వెళుతుంటాను. మైసూర్‌లో నవరాత్రి పూజలను ఘనంగా చేస్తారు. మైసూర్ ప్యాలెస్‌ని బాగా డెకరేట్ చేస్తారు. జాతర జరుగుతుంది. స్టాల్స్ పెడతారు. 'మైసూర్ దసరా' చాలా పాపులర్. ఈ పండగ సమయంలో సిటీ మొత్తం జనాలతో కిటకిటలాడిపోతుంది.

'ఫాస్టింగ్' అనేది సైంటిఫికల్లీ, ట్రెడిషనల్లీ మంచిది అని నా అభిప్రాయం. అయితే నవరాత్రి టైమ్‌లో ఉపవాసం ఉండను. కానీ నాన్ వెజ్‌కి దూరంగా ఉంటాను. నెలలో రెండుసార్లు ఏకాదశి వస్తుంది కదా... అప్పుడు ఉపవాసం ఉంటాను. ఏకాదశి వస్తోందంటే చాలు... 'నువ్వు ఫాస్టింగ్ ఉండాలి' అని నా బాడీ నాకు గుర్తు చేస్తుంది. నా మైండ్ అలా ట్యూన్ అయిపోయింది. చెడుపై మంచి గెలవడం అనేది దసరా థీమ్. ఒక చెడు ఉంటేనే మంచి జరుగుతుంది. అపజయాలను నేను ఇలానే భావిస్తాను. ఫెయిల్యూర్ ఎదురైతేనే కదా సక్సెస్ కోసం ప్రయత్నం చేస్తాం. సో... ఫెయిల్యూర్స్‌ని చెడుగా భావించను. చెడుని అంతం చేయడానికి అమ్మవారు ఏం చేసిందో మనందరికీ తెలుసు. అలాగే మనకు ఎదురయ్యే ఫెయిల్యూర్స్‌ని ఎదుర్కోవడానికి మనం సిద్ధంగా ఉండాలి. కొందరు మహిళలు సపోర్ట్‌ని ఆశిస్తారు. కానీ మనకు మనమే సపోర్ట్ సిస్టమ్ అవ్వాలి. మన శక్తిని మనం గుర్తించగలగాలి. నాకు ఏదైనా చెడు ఎదురైందనుకోండి అది నా 'స్టెప్పింగ్ స్టోన్' అని నమ్ముతాను. జీవితం లో ఎదురయ్యే సవాల్‌ని అలా అనుకుంటే సక్సెస్ అయిపోతాం. స్త్రీలు ఇంటిల్లిపాదినీ చూసుకోవాలి. అది చాలా పెద్ద బాధ్యత. అయితే అందరి బాగోగులు చూస్తూ చాలామంది మహిళలు తమ గురించి పట్టించుకోరు. కానీ మన గురించి కూడా మనం పట్టించుకోవాలి. ఇన్నర్‌గా మనం హ్యాపీగా ఉంటే చుట్టూ ఉన్నవాళ్లను మనం ఇంకా హ్యాపీగా ఉంచగలుగుతాం. ఇంకో ముఖ్యమైన విషయం ఏంటంటే... అందర్నీ హ్యాపీగా ఉంచడమే మన పని అని ఫిక్స్ అయిపోకండి. మనం హ్యాపీగా, హెల్తీగా ఉండటం కూడా ముఖ్యం. జీవితంలో 'పాజిటివిటీ' చాలా ముఖ్యం. ఒక పని చేసే ముందు 'ఇది మనవల్ల అవుతుంది. చేసి తీరతాం' అని పాజిటివ్‌గా ఆలోచించాలి. ఆ పాజిటివిటీ మనల్ని చాలా దూరం తీసుకెళుతుంది. చదువుకునే అమ్మాయిలకు, ఉద్యోగం చేసుకునేవారికి నేను చెప్పేదేంటంటే... ఏ విషయంలోనూ 'నా వల్ల కాదు' అనుకోకండి. స్త్రీలు తలచుకుంటే చేయలేనిదేం ఉండదు. పాజిటివ్ గా ఆలోచించండి. అంతా మంచే జరుగుతుంది. చెడు ఆలోచనలను దూరం పెట్టండి. ఆటోమేటిక్‌గా మంచి దగ్గరవుతుంది. ఈ పద్ధతి ఫాలో అయితే జీవితం కష్టంగా ఉండదు... తేలికగా సాగిపోతుంది'' అని చెపారు

## మనం కలిసి బతుకుదామా...



**నేను ఏ సినిమా చేసినా అందులో ఒక కొత్త కాన్సెప్ట్ ఉండేలా చూసుకుంటాను. 'థామా' సినిమా కాన్సెప్ట్ ఆడియన్స్‌ని అలరిస్తుంది. ఈ సినిమాలోని అలోక్ క్యారెక్టర్ చేయడం కొత్తగా అనిపించింది. 'థామా' చిత్రం కోసం యాక్షన్ సీక్వెన్స్ చాలా చేశాను'' అని ఆయుష్మాన్ ఖురానా అన్నారు. ఆయుష్మాన్ ఖురానా, రష్మికా మందన్నా హీరో హీరోయిన్లుగా నటించిన హిందీ చిత్రం 'థామా'. మాడాక్ హారర్ ఫిల్మ్స్ యూనివర్స్ (ఎమ్‌హెచ్‌సీయు) లో భాగంగా ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వంలో దినేష్ విజన్, అమర్ కౌశిక్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 21న విడుదల కానుంది.**

**ఈ సందర్భంగా హైదరాబాద్‌లో 'థామా' సినిమా తెలుగు ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకలో ఆయుష్మాన్ ఖురానా మాట్లాడుతూ– ''నా సినిమా ప్రమోషన్స్ కోసం తొలిసారిగా హైదరాబాద్ వచ్చాను. ఇక్కడికి రావడం చాలా సంతోషంగా ఉంది. 'థామా' ఫుల్ పాన్ ఇండియా మూవీ. రష్మికగారితో తొలిసారి కలిసి నటించడం సంతోషంగా ఉంది. ఆమె బ్రిలియంట్ పెర్ఫార్మర్. 'థామా' సినిమాను థియేటర్స్‌లో చూసి, ఎంజాయ్ చేయండి'' అని అన్నారు. ''మాడాక్ హారర్ కామెడీ యూనివర్స్ నుంచి వచ్చే సినిమాలకు ప్రేక్షకుల్లో మంచి ఆదరణ ఉంది.**

**'థామా' సినిమా కూడా ప్రేక్షకులను అలరిస్తుంది. ఈ సినిమాలో ఆడియన్స్‌ని సర్‌ప్రైజ్ చేసే క్యారెక్టర్ చేశాను'' అని తెలిపారు రష్మికా మందన్నా. 'పోలీసుల కోసం నేను ఏమైనా చేస్తాను', 'ఏం చేశారో చెప్పండి', 'విక్రమార్కుడు సినిమా ఎనిమిది సార్లు చూశాను సార్', 'నేను వెళ్లక తప్పదు అలోక్... నా కారణంగా నువ్వు కూడా ప్రమాదంలో పడతావ్..', 'నాకేం కలిసి చనిపోయే ఉద్దేశం లేదు... మనం కలిసి బతుకుదామా!', 'నేను నీతో పాటు ఉండలేను... మన ప్రపంచాలు ఒకటి కావు' అనే డైలాగ్స్ 'థామా' తెలుగు ట్రైలర్‌లో ఉన్నాయి.**

# 1,050 సినిమాల పైరసీ..

## రూ.22,400 కోట్ల నష్టం



**దేశంలోనే అతిపెద్ద సినీ పైరసీ గుట్టురట్టు చేశారు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు. పైరసీకి సంబంధించి కీలక ఆధారాలు సేకరించారు. ఈ వ్యవహారం జరుగుతున్న విధానం, మార్కె టింగ్, ఆర్థిక లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు చేపట్టారు. ఐదేళ్లలో 1,050 సినిమాలను పైరసీ చేసిన ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సోమవారం ప్రకటించారు. వీరిలో ఓ నిందితుడు మూడేళ్లలో 550 సినిమాలు పైరసీ చేయగా... నలుగురితో కూడిన ముఠా ఐదేళ్లలో 500 సినిమాలు చేసినట్లు గుర్తించామన్నారు. ఈ పైరసీతో చిత్ర పరిశ్రమకు రూ.22,400 కోట్ల నష్టం వాటిల్లిందని చెప్పారు. ఈ మేరకు ఫిల్మ్ డెవల్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో కలిసి సీవీ ఆనంద్ తన కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు.**

**ఈ అశ్వని కుమార్ మామూలోడు కాదు...**

బిహార్‌కు చెందిన అశ్వినీ కుమార్ పదో తరగతి వరకు చదివాడు. ఆన్‌లైన్ ద్వారానే హ్యాకింగ్ నేర్చుకున్న ఇతగాడి దృష్టి సినిమా పైరసీపై పడింది. విడుదలకు సిద్ధమైన చిత్రాన్ని నిర్మాతలు కొన్ని డిజిటల్ మీడియా సంస్థలకు అందిస్తారు. దాన్ని తమ సర్వర్లలో నిక్షిప్తం చేసుకునే ఈ సంస్థలు ప్రపంచవ్యాప్తంగా ఆయా థియేటర్లకు శాటిలైట్ ద్వారా పంపిస్తాయి. ఇలాంటి సంస్థలపై కన్నేసిన అశ్వినీ కుమార్ వాటి సర్వర్లను హ్యాక్ చేసి, విడుదలకు సిద్ధంగా ఉన్న, తాజాగా విడుదలైన చిత్రాలను తస్కరిస్తాడు. మూడేళ్లలో వివిధ భాషలకు చెందిన 550 సినిమాలను పైరసీ చేసి కొన్నింటిని విడుదలకు వారం రోజుల ముందే తస్కరించాడు. ఇలాంటి వాటిలో పుష్ప-2 కూడా ఉంది. పైరసీ ద్వారా లక్ష డాలర్లు (సుమారు రూ.88 లక్షలు) ఆర్జించినట్లు పోలీసులు గుర్తించారు. పటాన్‌లోని సంపత్ చక్‌లో ఇతడి ఇల్లు 80 గజాల్లో ఉంటుంది. ఈ ఇంటి చుట్టూ ఏకంగా 22 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నాడు.

**బెట్టింగ్ యాప్స్‌తో ఒప్పందాలు చేసుకుని...**

పైరసీ చేసిన సినిమాలను మార్కెటింగ్ చేసుకోవడానికి అశ్వినీ కుమార్ వివిధ టెలిగ్రాం చానల్స్ అడ్మిన్లతోపాటు గేమింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్లతో ఒప్పందాలు కుదుర్చుకున్నాడు. వీరి నుంచి ఒక్కో చిత్రానికి 10 వేల నుంచి 25 వేల డాలర్ల వరకు వసూలు చేస్తున్నాడు. టెలిగ్రాం చానల్స్‌లో నేరుగా సినిమా లింకు పెడుతుండగా... వెబ్‌సైట్స్‌లో యాడ్స్ రూపంలో ఈ లింకు ఇస్తున్నారు. పగటి పూట నిద్రపోయి, రాత్రి వేళల్లో మేల్కొనే ఇతడు తన హ్యాకింగ్ సత్తాను పరీక్షించుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘంతోపాటు బిహార్, జార్ఖండ్‌కు చెందిన వివిధ ప్రభుత్వ వెబ్‌సైట్లు, సర్వర్లను హ్యాక్ చేశాడు. దీనికోసం నెదర్లాండ్స్‌కు చెందిన ఐపీ అడ్రస్ వినియోగించాడు. ఇతడు చిత్రాలను నేరుగా సర్వర్ల నుంచి పైరసీ చేస్తుండటంతో అవన్నీ హెచ్‌డీ ప్రింట్‌తో ఉంటున్నాయి. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన క్రిప్టో కరెన్సీ ఇతగాడికి అషిమత్ సింగ్ ద్వారా చేరినట్లు పోలీసులు గుర్తించారు. ఇతడి హ్యాకింగ్ టాలెంట్ చూసి అవాక్కైన సీవీ ఆనంద్ నెలకు రూ.10 లక్షల జీతం ఇచ్చి అతడి సేవలు వినియోగించుకోచ్చన్నారు.

**క్యామ్ కార్డర్‌తో థియేటర్లలో...**

తమిళనాడుకు చెందిన సిరిల్ ఇన్ఫంట్ రాజ్ అమలదాస్ క్యామ్ కార్డర్ ద్వారా థియేటర్లలో సినిమాలు రికార్డు చేసి పైరసీ చేస్తున్నాడు. దీనికోసం వనస్థలిపురంలో ఉంటున్న జాన కిరణ్ కుమార్, తమిళనాడుకే చెందిన సుధాకరన్, గోవాకు చెందిన అర్సలాన్ అహ్మద్‌లతో ముఠా ఏర్పాటు చేశాడు. పైరసీ సినిమాలను హోస్ట్ చేయడానికి అమలదాస్ రెండు సర్వర్లను ఖరీదు చేశాడు. కిరణ్ కుమార్ మిగిలిన ఇద్దరితో కలిసి సినిమా విడుదలైన రోజు థియేటర్లలో మధ్యలో ఉండే వరుసల్లో టిక్కెట్లు బుక్ చేసుకుంటాడు. తమతోపాటు చుట్టు పక్కల ఉన్న సీట్లను బుక్ చేస్తాడు. క్యామ్ కార్డర్లు లేదా సెల్‌ఫోన్‌లో ప్రత్యేక క్యామ్ కార్డర్ యాప్‌ల సహకారంతో వీరు సినిమా రికార్డు చేస్తారు. ఈ ప్రింట్‌ను అమలదాస్ కొన్ని టోరెంట్స్‌తోపాటు ఇతర వెబ్‌సైట్లలో హోస్టు చేస్తున్నాడు. వారి నుంచి ఒక్కో సినిమాకు 3 వేల డాలర్ల వరకు వసూలు చేస్తూ అనుచరులకు వాటా ఇస్తున్నాడు. వీళ్లు ఐదేళ్లలో 500 సినిమాలు పైరసీ చేయగా... కొన్నింటిని హైదరాబాద్‌లోని థియేటర్లలో రికార్డు చేశారు. ఇలా ఇప్పటివరకు రూ.2 కోట్లు సంపాదించారు. హిట్, సింగిల్, కుబేర, హరి హర వీరమల్లు చిత్రాల పైరసీపై నమోదైన కేసుల్ని దర్యాప్తు చేసిన పోలీసులు ఈ ఐదుగురినీ అరెస్టు చేశారు. వీరికి సహకరించిన ఇతర నిందితుల కోసం గాలిస్తున్నారు.

**సినీ ప్రముఖులతో సీపీ భేటీ**

సినిమా పైరసీ పూర్వాపరాలు, నిరోధానికి తీసుకుంటున్న చర్యల్ని వివరించడానికి హైదరాబాద్ పోలీసులు సినీ ప్రముఖులతో భేటీ అయ్యారు. పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి ప్రముఖ నటులు చిరంజీవి, నాగార్జున, వెంకటేష్, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు హాజరయ్యారు. సినీ నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిజిటల్ డిస్ట్రిబ్యూషన్ భాగస్వాములు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని పోలీసులు వివరించారు. క్యామ్ కార్డర్ పైరసీని నిరోధించడానికి థియేటర్లలో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. థియేటర్ యజమానులు నిఘా పెంచాలని కోరారు. పైరసీ ముఠాలను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన ఏసీపీ ఆర్‌జీ శివమారుతితోపాటు ఇన్‌స్పెక్టర్లు ఎస్.నరేష్, సతీష్‌రెడ్డి, ఎన్.దిలీప్ కుమార్, కె.మధుసూదన్ రావులను అభినందించారు.

# పవన్ కళ్యాణ్ ఓజీకి బిగ్ షాక్..!

**పవన్ కళ్యాణ్ ఓజీ సినిమాకు తెలంగాణలో బిగ్ షాక్ తగిలింది. ఈ సినిమా టికెట్ ధరల పెంపును రద్దు చేయాలంటూ తెలంగాణ పోలీస్ శాఖ జీవో రిలీజ్ చేసింది. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని సింగిల్ స్క్రీన్స్, మల్టీప్లెక్స్ యాజమాన్యాలను ఆదేశించింది. ఓజీ టికెట్ రేట్స్ పెంపును తెలంగాణ హైకోర్టు సస్పెండ్ చేసిన తర్వాత.. జరిగిన పరిణామాలను పోలీస్ శాఖ తన జీవోలో ప్రస్తావించింది. అంతకుముందు ప్రీమియర్ షోలతో పాటు అక్టోబరు 4 వరకు టికెట్ రేట్లు పెంచుకోవచ్చని తెలంగాణ గవర్నమెంట్ అనుమతులిచ్చిన సంగతి తెలిసిందే.**

**టికెట్ రేట్లపై పిటిషన్**

**ఓజీ టికెట్ రేట్ల పెంపును సవాల్ చేస్తూ మహేశ్ యాదవ్ అనే వ్యక్తి హైకోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. విచారణ అనంతరం ఆ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ.. జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ఈ నెల 24న ఆదేశాలు జారీ చేశారు. ఈ సినిమా టికెట్ రేట్లపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ ఈ నెల 26 వరకు స్టే విధించింది. రివ్యూ పిటిషన్‌పై ఇరు వర్గాల వాదనలు విన్న కోర్టు.. టికెట్ ధరలు పెంచడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఇటీవల హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలు కొనసాగుతాయని తెలిపింది. దీనిపై తదుపరి విచారణను అక్టోబరు 9వ తేదీకి వాయిదా వేసింది. అంతేకాకుండా టికెట్ ధరలు ఎందుకు పెంచాలనుకుంటున్నారో కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించింది.**



# ప్రపంచకప్ వేటకు రెడీ...




## నేటి నుంచి మహిళల వన్డే వరల్డ్‌కప్

**తొలి మ్యాచ్‌లో శ్రీలంకతో భారత్ ‘ఢీ’**

**బరిలో 8 జట్లు**

**ఫైనల్ నవంబర్ 2న**

**మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం**

సొంతగడ్డపై భారత మహిళల జట్టు వన్డే ప్రపంచకప్ వేటకు సిద్ధమైంది. ఇంటా బయటా ఎన్నో చిరస్మరణీయ విజయాలు సాధించిన మహిళల జట్టుకు ఐసీసీ ప్రపంచకప్ వెలతిగానే ఉంది. 47 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు సొంతగడ్డపై జరిగే మెగా ఈవెంట్‌లో తెరదించాలని క్రికెట్ అభిమానులు గంపెడాశలు పెట్టుకున్నారు. గతంలో రెండుసార్లు ఫైనల్ చేరినా టీమిండియాకు నిరాశ తప్పలేదు. కానీ అప్పటికీ ఇప్పటికీ భారత మహిళల జట్టు ఎంతో మారింది. ప్రపంచకప్‌ను గెలిచే సత్తా కలిగి ఉంది. గువాహటి: దశాబ్దాలుగా అందని ద్రాక్షగా ఉన్న ఐసీసీ ప్రపంచకప్‌ను ఎలాగైనా ఈసారి అందుకోవడమే లక్ష్యంగా భారత మహిళల జట్టు బరిలోకి దిగుతోంది. వన్డే ప్రపంచకప్‌లో నేడు తొలి మ్యాచ్ ఆతిథ్య దేశాలు భారత్, శ్రీలంకల మధ్య ఇక్కడ జరుగనుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం సొంతగడ్డ అనుకూలతల్ని వినియోగించుకొని మెగా ఈవెంట్‌లో రాణించాలనే పట్టుదలతో ఉంది. ఇటీవల పరిమిత ఓవర్ల ఫార్మాట్ ఫామ్ కూడా భారత జట్టులో కొండంత ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. భారత్ పటిష్టమైన ప్రత్యర్థే కాదు... టైటిల్ ఫేవరెట్లలో ఒకటని కచ్చితంగా చెప్పొచ్చు.

**ఫామ్‌లో స్మృతి మంధాన**

భారత వైస్ కెప్టెన్ స్మృతి మంధాన జోరు మీదుంది. ఇది జట్టుకు బాగా కలిసొచ్చే అంశం. టాపార్డర్‌లో ప్రతీక, హర్లీన్ నిలకడగా రాణిస్తున్నారు. జెమీమా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్, దీప్తి శర్మలతో మిడిలార్డర్ కూడా పటిష్టంగా ఉంది. బౌలింగ్ బలగంలో రేణుక, క్రాంతి, అరుంధతిలతో కూడిన పేస్ దళానికి కొత్త స్పిన్ కెరటం శ్రీచరణి జతయ్యింది. మరోవైపు శ్రీలంక కూడా ప్రపంచకప్‌కు దీటుగా సిద్ధమై వచ్చింది. భారత్ లాగే ఆతిథ్య అనుకూలతల్ని సొమ్ము చేసుకోవాలని భావిస్తోంది.

**5న పాక్‌తో భారత్ పోరు**

శ్రీలంకతో మంగళవారం తొలి మ్యాచ్ ఆడాక భారత జట్టు కొలంబోకు వెళుతుంది. అక్టోబర్ 5న కొలంబో వేదికగా పాకిస్తాన్‌తో టీమిండియా ఆడుతుంది. పాక్‌తో మ్యాచ్ ఆడాక భారత బృందం తిరిగి స్వదేశానికి చేరుకుంటుంది. విశాఖపట్నంలో అక్టోబర్ 9న దక్షిణాఫ్రికాతో, అక్టోబర్ 12న విశాఖపట్నంలోనే ఆస్ట్రేలియాతో భారత్ తలపడుతుంది.
ఈ రెండు మ్యాచ్‌ల తర్వాత అక్టోబర్ 19న ఇండోర్‌లో ఇంగ్లండ్‌తో ఆడనున్న భారత్... అక్టోబర్ 23న నవీ ముంబైలో న్యూజిలాండ్ జట్టుతో, అక్టోబర్ 26న నవీ ముంబైలోనే బంగ్లాదేశ్‌తో ఆడి లీగ్ దశను ముగిస్తుంది. లీగ్ దశ ముగిశాక టాప్-4లో నిలిచిన జట్లు సెమీఫైనల్ చేరుకుంటాయి.

**ఆస్ట్రేలియా ఏడు సార్లు...**

ఇప్పటి వరకు 12 సార్లు మహిళల వన్డే వరల్డ్ కప్ జరిగింది. ఆస్ట్రేలియా అత్యధికంగా ఏడు సార్లు (1978, 1982, 1988, 1997, 2005, 2013, 2022) చాంపియన్‌గా నిలిచింది. ఇంగ్లండ్ నాలుగు సార్లు (1973, 1993, 2009, 2017), న్యూజిలాండ్ ఒకసారి (2000) విజేతగా నిలిచాయి.

**ఇదీ మన చరిత్ర**

మహిళల క్రికెట్‌లో మన జట్టు 1976లో అరంగేట్రం చేసింది. 1978లో స్వదేశంలో జరిగిన ప్రపంచకప్‌లో భారత్ తొలి సారి పాల్గొంది. కానీ పురుషుల జట్టులా మేటిగా ఎదిగేందుకు దశాబ్దాల సమయం పట్టింది. 21 ఏళ్ల తర్వాత 1997లో జరిగిన ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు సెమీఫైనల్ చేరింది. అలా ఎట్టకేలకు వెలుగులోకి వచ్చిన భారత్‌కు 2005 ప్రపంచకప్ టర్నింగ్ పాయింట్ అయ్యింది. ఆ మెగా ఈవెంట్‌లో ఫైనల్ చేరిన భారత్ చివరకు రన్నరప్‌గా తృప్తిపడింది. మళ్లీ 12 ఏళ్ల తర్వాత కూడా 2017లో టైటిల్ బరిలో ఉన్నప్పటికీ ‘కప్’ ముచ్చట అయితే తీరలేదు. మళ్లీ రన్నరప్‌గానే నిలిచింది.

**ఇదీ ప్రస్తుత కప్ కథ**

భారత్, శ్రీలంక జట్లు సంయుక్తంగా ఈ మెగా ఈవెంట్‌కు ఆతిథ్యమిస్తున్నాయి. మొత్తం 5 వేదికలు కాగా... విశాఖపట్నం, నవీ ముంబై, గువాహటి, ఇండోర్ ఈ నాలుగు భారత నగరాలు. శ్రీలంకలోని కొలంబో ఐదో వేదిక. ఆతిథ్య జట్లు సహా డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లాంటి గట్టి ప్రత్యర్థులే బరిలో ఉండటం వల్ల బోర్ కొట్టించే మ్యాచ్‌లకు చోటు లేదు. ప్రతీ జట్టు మిగతా ఏడు ప్రత్యర్థులతో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో తలపడుతుంది. అంటే ఒక్కో జట్టుకు లీగ్ దశలో ఏడు మ్యాచ్‌లుంటాయి. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్ చేరతాయి. అక్టోబర్ 29, 30 తేదీల్లో రెండు సెమీఫైనల్స్ గువాహటి, ముంబై, నవంబర్ 2న ఫైనల్ ముంబైలో జరుగుతాయి. అయితే పాక్ మ్యాచ్‌లన్నీ శ్రీలంకలోనే ఆడుతుంది. నాకౌట్‌కు చేరితే ఫైనలైనా... సెమీఫైనలైనా... కొలంబోలోనే పాకిస్తాన్ ఆడుతుంది.

# మా ఆటగాళ్లంతా ఒక్కో ట్రోఫీతో సమానం’



## కప్ లేకపోయినా మా విజయం విలువ తగ్గదు

**భారత టి20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వ్యాఖ్య**

దుబాయ్: ఆసియా కప్ టి20 టోర్నీలో విజేతగా నిలిచిన తర్వాత జరిగిన అనూహ్య పరిణామాలపై భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పందించాడు. చాంపియన్ టీమ్‌కు ట్రోఫీ ఇవ్వకుండా నిలిపివేసిన ఘటన గతంలో ఎన్నడూ చూడలేదని అతను అన్నాడు. అయితే తాము ఈ విషయాన్ని పట్టించుకోమని, ట్రోఫీ లేకపోవడం వల్ల తమ విజయం విలువ ఏమాత్రం తగ్గదని సూర్య వ్యాఖ్యానించాడు.
‘ఒక క్రికెట్ అభిమానిగా, ఆపై ఆటగాడిగా ఇలాంటి ఘటనను ఎప్పుడూ చూడలేదు. ఎంతో కష్టపడి విజేతగా నిలిచి సంపాదించిన ట్రోఫీని ఆటగాళ్లకు ఇవ్వకపోవడం ఏమిటి? దానిని అందుకునేందుకు మాకు పూర్తి అర్హత ఉంది. అయితే ట్రోఫీల గురించే మాట్లాడాల్సి వస్తే మా డ్రెస్సింగ్‌రూమ్‌లోనే ఇలాంటి 14 ట్రోఫీలు ఉన్నాయి. ఈ ఆసియా కప్ గెలుపు ప్రయాణంలో మా ఒక్కో ఆటగాడు, సహాయక సిబ్బంది ఒక్కో ట్రోఫీతో సమానం. పాకిస్తానీ చేతుల మీదుగా ట్రోఫీని స్వీకరించరాదనే విషయం మాకు ఎవరూ చెప్పలేదు. మా జట్టు సభ్యులంతా మైదానంలో కలిసి తీసుకున్న నిర్ణయమిది’ అని సూర్యకుమార్ స్పష్టం చేశాడు. మరోవైపు పహల్గాం దాడిలో మృతి చెందిన కుటుంబాల సంక్షేమం కోసం తాను ఆసియా కప్‌లో 7 మ్యాచ్‌ల ద్వారా అందుకున్న మ్యాచ్ ఫీజు మొత్తాన్ని (రూ. 28 లక్షలు) విరాళంగా ఇస్తున్నట్లు సూర్యకుమార్ ప్రకటించాడు

**నక్వీ తీసుకెళ్లిపోయాడు!**

ఫైనల్ ముగిసిన తర్వాత బహుమతి ప్రదానోత్సవానికి వేదికను ఏర్పాటు చేశారు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడు, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మన్, పాకిస్తాన్ ప్రభుత్వంలో అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి కూడా అయిన మొహసిన్ నక్వీ అక్కడే ఉన్నాడు. అయితే పహల్గాం దాడి సమయంలో నక్వీ సోషల్ మీడియాలో భారత్‌కు వ్యతిరేకంగా పలు వ్యాఖ్యలు చేశాడు. దాంతో అతడి చేతుల మీదుగా ట్రోఫీని అందుకోబోమని భారత జట్టు ముందే ఏసీసీకి సమాచారం అందించింది. దాంతో ప్రత్యామ్నాయంగా వేదికపై ఉన్న ఇతర అధికారుల నుంచి అందించవచ్చని నిర్వాహకులు భావించారు.
అయితే నక్వీ వేదికపై ఉన్నంత సేపు తాము అక్కడికి వెళ్లమని భారత్ స్పష్టం చేసింది. అయితే నిబంధనల ప్రకారం ఏసీసీ అధ్యక్షుడి హోదాలో తానే ట్రోఫీ ఇస్తానంటూ నక్వీ మొండితనం ప్రదర్శించాడు. దాంతో చివరకు భారత్ కప్ అందుకోకుండానే కార్యక్రమం ముగిసింది. అయితే ఆశ్చర్యకరంగా, ఎవరూ ఊహించని విధంగా నక్వీ సన్నిహితులు కొందరు అక్కడ ఉన్న ఆసియా కప్ ట్రోఫీని తమతో పాటు తీసుకెళ్లిపోయారు. అనంతరం భారత జట్టు మొత్తం వేదిక వద్ద చేరి ఊహాత్మకంగా ట్రోఫీ చేతిలో ఉన్నట్లుగా నటిస్తూ సంబరాలు చేసుకుంది.

**బీసీసీఐ ఆగ్రహం...**

నక్వీ ప్రవర్తనపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ‘నక్వీ పాకిస్తాన్ రాజకీయ నాయకుడు కూడా. అందుకే ఆయన నుంచి ట్రోఫీ తీసుకోవద్దని భారత్ నిర్ణయించింది. కానీ ఆయన తనతో పాటు ట్రోఫీని, పతకాలను కూడా తీసుకెళ్లమని దానర్థం కాదు. అవన్నీ వీలైనంత త్వరగా భారత్‌కు వస్తాయని నమ్ముతున్నాం. నవంబరులో జరిగే ఐసీసీ సమావేశంలో ఏసీసీ అధ్యక్షుడి ప్రవర్తనపై మేం చాలా గట్టిగా నిరసన వ్యక్తం చేయనున్నాం’ అని సైకియా వెల్లడించారు. మరోవైపు టోర్నీలో భారత జట్టు ప్రవర్తన క్రికెట్‌ను అగౌరవపర్చినట్లుగా ఉందని పాక్ కెప్టెన్ సల్మాన్ ఆగా అన్నాడు. టోర్నీ ఆరంభానికి ముందు వేర్వేరు సందర్భాల్లో తనతో కరచాలనం చేసిన సూర్యకుమార్... జనం మధ్యలోకి వచ్చేసరికి మాత్రం షేక్ హ్యాండ్ ఇవ్వలేదని సల్మాన్ విమర్శించాడు.

**తిలక్ వర్మకు ఘన స్వాగతం...**

అద్భుత ఇన్నింగ్స్‌తో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ సోమవారం రాత్రి నగరానికి తిరిగొచ్చాడు. శంషాబాద్ విమానాశ్రయంలో అతనికి అభిమానులు, తెలంగాణ స్పోర్ట్ అథారిటీ అధికారుల నుంచి ఘన స్వాగతం లభించింది. ‘నేను క్రీజ్‌లోకి వచ్చిన సమయంలో పాకిస్తాన్ ఆటగాళ్లు ఎన్నో వ్యాఖ్యలు చేశారు.

# సూర్య క్రికెట్‌ను అవమానించాడు



దుబాయ్: ఆసియాకప్‌లో పాకిస్థాన్ ఆటగాళ్లతో కరచాలనం చేయకపోవడం, ఫైనల్లో గెలిచాక ఏసీసీ అధ్యక్షుడు మోసిన్ నఖ్వీ నుంచి ట్రోఫీ అందుకోకపోవడం లాంటి చర్యలతో భారత జట్టు క్రికెట్‌ను అవమానించిందని పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ ఆఘా అన్నాడు.
“ఆసియాకప్‌లో భారత్ ప్రవర్తన నిరాశపరిచింది. మాతో కరచాలనం చేయకపోవడం క్రికెట్‌కే అవమానం. మెరుగైన జట్లు ఇలా చేయవు. టోర్నీ ఆరంభానికి ముందు విలేకరుల సమావేశంలో సూర్య నాతో కరచాలనం చేశాడు. తర్వాత ఎవరి ఆదేశాలనో అనుసరిస్తూ ప్రవర్తించాడు. విజేతలకు ఏసీసీ అధ్యక్షుడు ట్రోఫీ ఇవ్వడం ఆనవాయితీ. అతడి నుంచి ట్రోఫీ అందుకోకపోతే మీకు అదెలా వస్తుంది” అని ఆఘా అన్నాడు.

**చెక్కు విసిరేసి..:** ఆసియాకప్ బహుమతి ప్రదానోత్సవంలో పాక్ కెప్టెన్ ఆఘా అసహనాన్ని ప్రదర్శించాడు. ఆఘాకు రన్నరప్ ట్రోఫీతో పాటు రూ.66.75 లక్షల చెక్‌ను అందించారు. దాన్ని అతడు పక్కకు విసిరేశాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతం అవుతోంది.

# యోధాస్‌పై జెయింట్స్ విజయం



చెన్నై: ప్రో కబడ్డీ లీగ్ 12వ సీజన్‌లో వరుసగా ఐదు ఓటముల తర్వాత గుజరాత్ జెయింట్స్ ఎట్టకేలకు విజయాన్ని అందుకుంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 33-27 పాయింట్ల తేడాతో యూపీ యోధాస్‌ను ఓడించింది. మొహమ్మద్ రెజా, అంకిత్ దహియా చెరో 8 పాయింట్లతో గుజరాత్ విజయంలో కీలక పాత్ర పోషించగా... రాకేశ్ 6, హరీశ్ 4 పాయింట్లు సాధించారు. యూపీ తరఫున భవానీ రాజ్‌పుత్ 8 పాయింట్లు నమోదు చేయగా...గగన్ గౌడ 6, కెప్టెన్ సుమీత్ 4 పాయింట్లు సాధించారు.
ఈ విజయం తర్వాత కూడా జెయింట్స్ పాయింట్ల పట్టికలో అట్టడుగున కొనసాగుతోంది. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్‌ను ఒక పాయింట్ తేడాతో ఓడించి దబంగ్ ఢిల్లీ తమ అగ్రస్థానాన్ని పటిష్టపర్చుకుంది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో ఢిల్లీ 38-37 పాయింట్లతో హరియాణా స్టీలర్స్‌పై గెలుపొందింది. దబంగ్ ఢిల్లీ ఆటగాళ్ళలో రెయిడర్ అశు మలిక్ చెలరేగిపోయాడు. అతనొక్కడే 15 పాయింట్లతో సత్తా చాటగా, నీరజ్ నర్వాల్ 6 పాయింట్లతో ఆకట్టుకున్నాడు.
మరోవైపు హరియాణా తరఫున అశుకంటే మెరుగైన ప్రదర్శనే కనబర్చినా... దురదృష్టవశాత్తూ వినయ్ జట్టును గెలిపించలేకపోయాడు. వినయ్ 18 పాయింట్లతో అదరగొట్టగా, కెప్టెన్ జైదీప్ 7, ఆశిష్ నర్వాల్ 5 పాయింట్లు సాధించారు. నేడు జరిగే మ్యాచ్‌లలో పట్నా పైరేట్స్‌తో తెలుగు టైటాన్స్... బెంగాల్ వారియర్స్‌తో పుణేరీ పల్టన్ తలపడతాయి.

# ఆటకు క్రిస్ వోక్స్ వీడ్కోలు



లండన్: ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ క్రిస్ వోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. గత వారం యాషెస్ సిరీస్‌కు ఎంపిక చేసిన ఇంగ్లాండ్ జట్టులో చోటు దక్కకపోవడంతో 36 ఏళ్ల వోక్స్ రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నాడు. ఇంగ్లాండ్ తరఫున 15 ఏళ్ల కెరీర్‌లో వోక్స్ 62 టెస్టుల్లో 2,034 పరుగులు చేసి.. 192 వికెట్లు పడగొట్టాడు. 122 వన్డేల్లో 1,524.. 33 టీ20ల్లో 147 పరుగులు సాధించాడు. రెండు ఫార్మాట్లలో కలిపి 204 వికెట్లు తీసుకున్నాడు. సొంతగడ్డపై 2019 వన్డే ప్రపంచకప్, ఆస్ట్రేలియాలో 2022 టీ20 వరల్డ్‌కప్ గెలుచుకున్న ఇంగ్లాండ్ జట్టులో వోక్స్ సభ్యుడు.

# భారత జట్టుకు రూ.21 కోట్ల ప్రైజ్‌మనీ

ముంబయి: చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను మట్టికరిపించి ఆసియాకప్ విజేతగా నిలిచిన భారత జట్టుకు బీసీసీఐ రూ.21 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించింది. “ఇదో అద్భుత విజయం. పాక్‌ను ఓడించి భారత్ ఆసియాకప్ గెలిచిన సందర్భంగా ఆటగాళ్లకు, సహాయక సిబ్బందికి రూ.21 కోట్ల నగదు బహుమతి ఇస్తున్నాం. టీమ్‌ఇండియా విజయానికి ఎంతో గర్విస్తున్నాం” అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా చెప్పాడు. “మూడు దెబ్బలు.. సున్నా స్పందన. ఆసియాకప్ ఛాంపియన్లు అయ్యాం. మా సందేశం ఇచ్చాం” అని బీసీసీఐ ట్వీట్ చేసింది.